


నూజివీడు ఎక్స్‌అఫిషియో సభ్యునిగా మంత్రి పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పుర పాలక సంఘం ఎక్స్ అఫిషియో సభునిగా రాష్ట్ర మంత్రి, నూజివీడు ఎంఎల్‌ఎ కొలుసు పార్థసారధి గురువారం ప్రమాణస్వీకారం చేశారు. స్థానిక పురపాలక సంఘ సమావేశ మందిరంలో పార్థసారథితో కమిషనర్ ఆర్.వెంకట్రామిరెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆర్.త్రివేణిదుర్గ, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న పార్థసారధి



పాలకోడేరు మండలం మోగల్లులో అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు



అల్లూరి వేషధారణలో విద్యార్థులు

పీడిత ప్రజల పక్షపాతి అల్లూరి

చించినాడ బ్రిడ్జి, నరసాపురం ఆక్వా యూనివర్సిటీలకు అల్లూరి పేరు పెట్టాలి

మన్య విప్లవ పోరాట స్ఫూర్తితో సామ్రాజ్యవాద పార్టీలపై పోరు

అల్లూరి శత వర్ధంతి సభలో వక్తల పిలుపు







భీమవరంలో అల్లూరి స్మృతివనం వద్ద సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు, చలసాని శ్రీనివాస్, మంతెన సీతారాం

ప్రజాశక్తి - భీమవరం టౌన్, నరసాపురం

పీడిల ప్రజల కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు అని, ఆయన పోరాట స్ఫూర్తిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని ప్రజాశక్తి మాజీ సంపాదకులు, రైతుసంఘం రాష్ట్ర నేత వి.శ్రీనివాసరావు అన్నారు. భీమవరం పట్టణంలోని జువ్వలపాలెం రోడ్డులో ఉన్న అల్లూరి స్మృతి వనం వద్ద అల్లూరి 127వ జయంతి సందర్భంగా గురువారం అల్లూరి శత వర్ధంతి సభ నిర్వహించారు. సభకు అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవావిజ్ఞాన కేంద్రం ఛైర్మన్ బి.బలరాం అధ్యక్షత వహించారు. తణుకు, ఆచంట, నరసాపురం, యలమంచిలి, తాడేపల్లిగూడెం, పెనుమంట్ర, పెనుగొండ, అత్తిలి, పోడూరు ప్రాంతాల నుంచి అల్లూరి అభిమానులు ఆయన స్వగ్రామమైన మోగల్లు చేరుకుని అక్కడి నుండి కుముదవల్లి మీదుగా పెద్దసంఖ్యలో మోటార్ సైకిల్ ర్యాలీగా భీమవరంలోని స్మృతి వనానికి చేరుకున్నారు. స్మృతి వనం చేరుకున్న నాయకులు అల్లూరి కాంస్య విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సభనుద్దేశించి శ్రీనివాసరావు మాట్లాడుతూ 27 ఏళ్ల వయస్సులోనే బ్రిటీష్ ప్రభుత్వాన్ని అల్లూరి గడగడలాడించారన్నారు. పార్లమెంట్‌లో అల్లూరి విగ్రహం పెట్టడానికి ఈ ప్రాంతానికి చెందిన నరసాపురం ఎంపీ, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మతోపాటు ఈ ప్రాంత ఎంపీలంతా కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో అల్లూరి జ్ఞాపకాలను అభివృద్ధి చేసేందుకు అల్లూరి విజ్ఞాన యాత్ర ప్రారంభించాలన్నారు. దేశంలో లౌకికవాదాన్ని కాపాడుకునేందుకు అల్లూరి స్ఫూర్తిగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. అల్లూరి తిరిగిన గ్రామాలైన మన్యం ప్రాంతంలో ఇప్పటికీ రోడ్లు, తాగునీరు, వంతెనలు లేవని విమర్శించారు. అల్లూరి ఆశయం స్వేచ్ఛా, స్వాతంత్రం ప్రతిఒక్కరికీ కావాలని, ఆయన ఆశయాన్ని కాపాడుకోవడానికి మనందరం ఆయన స్ఫూర్తిగా పోరాడాలని అన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ అల్లూరి స్ఫూర్తితో యువత సంఘటిత పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. తెలుగుజాతి ఆత్మ గౌరవాన్ని ఢిల్లీలో పవన్, చంద్రబాబు, జగన్, రేవంత్‌రెడ్డి తాకట్టు పెట్టారని విమర్శించారు. విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు అల్లూరి ఎక్స్‌ప్రెస్‌గా పేరు పెట్టాలని సభ ఏకగ్రీవంగా తీర్మానించిందన్నారు. ఈ తీర్మానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపిస్తామని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో విశాఖ స్టీల్‌ప్లాంట్ సాధన కోసం వేలాది మంది ప్రాణత్యాగం చేశారని, విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అంటూ సాధించిన విశాఖ ఉక్కును ప్రయివేట్‌పరం చేయడానికి వీలులేదని అన్నారు. యల్లాప్రగడ సుబ్బారావు వంటి వారు భీమవరానికి చెందిన వారని గుర్తు చేశారు. అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ఛైర్మన్ బి.బలరాం మాట్లాడుతూ అల్లూరి సొంత గ్రామం మోగల్లుతోపాటు ఆయన సంచరించిన దేవీపట్నం, అడ్డతీగల, చింతపల్లి మన్యం, రంపచోడవరం ప్రాంతాలను స్మారక చిహ్నాలుగా గుర్తించి అభివృద్ధి చేసి ప్రజలు సందర్శించేలా చూడాలన్నారు. ఉభయగోదావరి జిల్లాలను కలిపే చించినాడ బ్రిడ్జికి అల్లూరి పేరు పెట్టాలన్నారు. రాష్ట్రంలో మొట్టమొదటి ఆక్వా యూనివర్సిటీకి అల్లూరి పేరు పెట్టాలని, అలాగే భీమవరం ఓవర్ బ్రిడ్జికి కూడా అల్లూరి పేరు పెట్టాలని కోరారు. భీమవరం పట్టణంలో పాత బస్టాండ్ వద్ద గతంలో ఉన్న అల్లూరి సాంస్కృతిక కేంద్రాన్ని కూల్చివేసి పునర్నిర్మించకుడా చెత్తకేంద్రంగా మార్చాలని,



తాడేపల్లిగూడెం నుంచి మోటారు సైకిల్ ర్యాలీగా..

ఇది చాలా బాధాకర విషయమని అన్నారు. అదే స్థానంలో ఐదంతస్తుల భవనాన్ని నిర్మించి అల్లూరి సాంస్కృతిక కేంద్రంగా ఏర్పాటు చేయాలన్నారు. ఉద్దరాజు రామం ట్రస్ట్, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం మాట్లాడుతూ తాను మన్యం ప్రాంతంలో పని చేస్తున్నానని, అక్కడ ఆదివాసీలను చూస్తే ప్రతిఒక్కరూ అల్లూరి సీతారామరాజులా కన్పిస్తున్నారన్నారు. ఈ ప్రాంతంలో జన్మించి భాషకు సంబంధం లేని ప్రాంతంలో అల్లూరి ఆదివాసీల మనస్సు గెలిచి, వాళ్లను చైతన్యపరిచి బ్రిటీష్ వారిపై యుద్ధం చేశారన్నారు. తన కోసం కాకుండా జనహితం కోసం బతికే నాయకుల జీవిత చరిత్ర పాఠ్య పుస్తకాల్లో చేర్చాలన్నారు. రచయిత, సాహితీవేత్త కూనపరాజు కుమార్ మాట్లాడుతూ తాను సీతారామరాజు సంచరించిన మన్యంలో పర్యటించానని, దీంతో 40 ఏళ్ల క్రితం ఆయనపై పుస్తకం రాశానని తెలిపారు. సామ్రాజ్యవాదులు ఎప్పుడూ ఉంటారని, వాళ్లెప్పుడూ కొత్త ఆలోచనలతో దోచుకోవడానికి చూస్తుంటారని, అల్లూరి స్ఫూర్తితో వారి కుయుక్తులను తిప్పికొట్టాలన్నారు. సీతారామరాజు దాడి చేసిన పోలీస్ స్టేషన్ల స్థానంలో కొత్త పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేశారని, అయితే పాత పోలీస్ స్టేషన్లను సీతారామరాజు గుర్తుగా స్మారక చిహ్నాలుగా అభివృద్ధి చేయాలని అన్నారు.

ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు పి.మంగరాజు రచించిన మన్య విప్లవం అనే పుస్తకాన్ని అల్లూరి శత వర్ధంతి సభలో వక్తలు ఆవిష్కరించారు. రచయిత, సాహితీవేత్త కూనపరాజు కుమార్ రచించిన ఆ అగ్ని పేరే అల్లూరి సీతారామరాజు అనే పుస్తకాన్ని కూడా ఆవిష్కరించారు. ఈ పుస్తకాలను చదివి ఆయన చరిత్రను తెలుసుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు.

అలరించిన ప్రజానాట్యమండలి పాటలు

అల్లూరి శత వర్ధంతి సభలో ప్రజా నాట్యమండలి కళాకారులు ఆలపించిన అల్లూరి ప్రత్యేక గీతాలు అందర్నీ అలరించాయి ఆలోచింపజేశాయి. పలు పాఠశాలల నుండి విద్యార్థులు అల్లూరి వేషధారణతో విచ్చేసి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం అధ్యక్షులు గాదిరాజు సుబ్బరాజు, రిటైర్డ్ జడ్జి మైలా రామ్మూర్తివర్మ, ఎఫ్.విల్సన్‌రాజు, కలిదిండి గోపాలకృష్ణంరాజు, వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాద్‌రాజు, చెరుకూరి ఝాన్సీలక్ష్మి, ఎబిఎస్‌వికె కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, చెరుకువాడ సుబ్రహ్మణ్యారాజు, మాజీ నీటి సంఘం అధ్యక్షులు పాతపాటి మురళీకృష్ణంరాజు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నేత గాతర జేమ్స్, నాయకులు చింతకాయల బాబూరావు, కవురు పెద్దిరాజు, కర్రి నాగేశ్వరరావు, ముచ్చర్ల త్రిమూర్తులు, మామిడిశెట్టి రామాంజనేయులు, క్రాంతి, బి.వాసుదేవరావు, పలువురు నేతలు పాల్గొన్నారు.



పుస్తకాలను ఆవిష్కరించిన ప్రముఖులు

అల్లూరికి ఘన నివాళి

పురిటిగడ్డ మోగల్లు నుంచి భీమవరం వరకు భారీ మోటార్ సైకిల్ ర్యాలీ

తరలొచ్చిన అగ్రనేతలు, ప్రజలు

ప్రజాశక్తి - పాలకోడేరు

అల్లూరి సీతారామరాజు 127వ జయంతి సందర్భంగా విప్లవ వీరుడికి ఘన నివాళులర్పించారు. బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన అల్లూరి పురిటిగడ్డ మోగల్లులో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ప్రజాశక్తి మాజీ సంపాదకులు, రైతుసంఘం రాష్ట్ర నాయకులు వి.శ్రీనివాసరావు, ప్రత్యేక హోదా సాధన సమితి, మేధావుల ఫోరం అధ్యక్షులు చలసాని శ్రీనివాస్, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, అల్లూరి శతవర్ధంతి సభ నిర్వహణా కమిటీ ఛైర్మన్ బి.బలరాం, ఇతర నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీతారామరాజు స్వాతంత్ర సంగ్రామంలో అందించిన సేవలను స్మరించుకున్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన అల్లూరి స్మారక మందిరాన్ని శ్రీనివాసరావుతోపాటు, ఇతర నేతలు సందర్శించారు. అనంతరం మోగల్లు నుంచి ప్రారంభమైన భారీ మోటార్ సైకిల్ ర్యాలీలో రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, నేతలు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అక్కడ నుంచి పాలకోడేరు, కుముదవల్లి మీదుగా భీమవరం అల్లూరి స్మృతి వనం వరకు ర్యాలీ సాగింది.

విద్యాసంస్థల బంద్ సంపూర్ణం



ఏలూరు అర్బన్ : ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో నిరసన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని, అవకతవకలకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఏలూరు నగరంలో విద్యాసంస్థల బంద్ సంపూర్ణంగా జరిగింది. నగరంలోని అన్ని ప్రయివేటు విద్యాసంస్థలు ముందుగానే సెలవు ప్రకటించాయి. సిఆర్‌రెడ్డి పబ్లిక్ స్కూల్, 12 పంపుల సెంటర్లోని గాంధీ మున్సిపల్ హైస్కూల్, సుబ్బమ్మదేవి హైస్కూల్, సెయింట్ థెరిస్సా కళాశాల, గవర్నమెంట్ బాలికల పాఠశాల తదితర వాటిని బంద్ నిర్వాహకులు మూయించారు. అనంతరం ఎస్‌ఎఫ్ఐ, పిడిఎస్‌యు, ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఫైర్‌స్టేషన్ సెంటర్లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అనిల్‌కుమార్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు కె.నాని, ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్, పిడిఎస్ఒ జిల్లా కార్యదర్శి ఎస్.మోహన్ మాట్లాడుతూ నీట్ పరీక్షను రద్దు చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని, నీట్ పరీక్షను జరిపిన ఎన్‌టిఎ సంస్థను రద్దు చేయాలని, నీట్ పరీక్ష రాసిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పరీక్ష రాసిన విద్యార్థులకు నష్టపరిహారాన్ని చెల్లించాలని, విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని అన్నారు. పాఠశాలల మూసివేతను ఆపాలని, విద్యను అందరికీ అందుబాటులో తీసుకురావాలని, లేనిపక్షంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి అఖిల్, క్రాంతి, మనోజ్, ఎం.ప్రశాంత్, రాజా తదితరులు నాయకత్వం వహించారు.

జీలుగుమిల్లి: నీట్ ప్రశ్నాపత్రం లీకేజీని వ్యతిరేకిస్తూ ఎస్‌ఎఫ్ఐ, పిడిఎస్‌యు తదితర విద్యార్థి సంఘాల అధ్వర్యంలో గురువారం చేపట్టిన బంద్ విజయవంతమైంది. ఈ బంద్‌కు ప్రయివేటు పాఠశాలలు ముందుగానే సెలవు ప్రకటించాయి.

బుట్టాయగూడెం: పిడిఎస్‌యు ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా నేతలు ఎం.సిద్దు మాట్లాడగా పి.మహేష్, కె.సాయి పాల్గొన్నారు.

ఎరుపెక్కిన గోదావరి

స్పిల్‌వే నుండి నీటి విడుదల



స్పిల్‌వే వద్ద పెరుగుతున్న గోదావరి వరద

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టు ఎగువన గోదావరి నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతోంది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరికి ఉప నదులైన శబరి, ఇంద్రావతి, సీలేరు, కిన్నెరసాని, మానేరు, ప్రాణహిత, మంజీర, పూర్ణ, ప్రవర, పర్ణ నీటిమట్టాలు పెరిగి జలాలు గోదావరిలో కలుస్తుండటంతో గోదావరి నీళ్ల రంగు ఎరుపెక్కింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 26.390 మీటర్లు, దిగువన 16.430 మీటర్లు, ఎగువ కాపర్ డ్యామ్‌కు ఎగువన 26.480 మీటర్లు, దిగువ కాపర్ డ్యామ్‌కు దిగువన 16.520 మీటర్లు నీటిమట్టం నమోదైనట్లు అధికారులు తెలిపారు. స్పిల్‌వేలోకి వస్తున్న వరద జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నట్లు ఇఇలు మల్లికార్జునరావు, పి వెంకటరమణ తెలిపారు.

లైంగిక వేధింపుల నిరోధానికి కమిటీలు

కలెక్టర్ కె.వెట్రిసెల్వి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

పని చేసే ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధానికి ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోనూ కమిటీలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. స్థానిక కలెక్టరేట్లోని గోదావరి సమావేశపు హాలులో గురువారం మహిళలపై లైంగిక వేధింపుల నిరోధానికి తీసుకోవాల్సిన చర్యలపై మహిళా శిశు సంక్షేమ శాఖ నిర్వహించిన జిల్లాస్థాయి శిక్షణా కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్యాలయాల్లో పని చేసే మహిళలు ఇంటి వద్ద బయలుదేరిన దగ్గర నుండి కార్యాలయానికి చేరుకుని విధులు నిర్వర్తించి, అనంతరం ఇంటికి వెళ్లే వరకు ఎన్నో విధాలుగా వేధింపులకు గురవుతున్నారన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు నలుగురు సభ్యులతో ఏర్పాటు చేయాలని, వారిలో కనీసం ఇద్దరు మహిళలను కూడా సభ్యులుగా నియమించాలన్నారు. కార్యాలయాల్లో మహిళలపై లైంగిక వేధింపులు జరిపే వారిపై తీవ్రమైన చర్యలుంటాయన్నారు. బాధిత మహిళల నుండి ఫిర్యాదు తీసుకోవడం, ఫిర్యాదుపై తదుపరి చర్యలు, ఫిర్యాదుపై విచారణకు కమిటీని ఏర్పాటు చేసి, విచారణ అనంతరం వేధింపులు చేసిన వ్యక్తిపై తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక అందించడం, ఫిర్యాదుదారుల్లో ఆత్మస్థైర్యం కలిగించడం తదితర చర్యలపై కమిటీ సభ్యులకు, ఉద్యోగులకు అవగాహన కలిగించాలన్నారు. బాధిత మహిళలకు న్యాయం జరిగేలా సంబంధిత కమిటీలు పని చేయాలన్నారు. అదనపు ఎస్‌పి స్వరూపరాణి మాట్లాడుతూ పని చేసే ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులు జరిపే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. నేరం రుజువైతే సంఘటన తీవ్రతను అనుసరించి జరిమానా, జైలు శిక్ష లేదా నిందితుడిని ఉద్యోగంలో నుండి కూడా తొలగించవచ్చన్నారు. రాష్ట్రస్థాయి రిసోర్స్‌పర్సన్ కూనా కృష్ణారావు మాట్లాడుతూ మహిళలపై లైంగిక వేధింపులపై భారతీయ శిక్షాస్మృతిలో చట్టాలను వివరించారు. ఈ సందర్భంగా సదరు చట్టం అమలుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ముద్రించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు, డిపిఒ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, ఆర్‌డిఒ ఎన్‌ఎస్‌కె.ఖాజావలి, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, సాంఘిక సంక్షేమ శాఖ జెడి ప్రకాశరావు, జిల్లా బిసి సంక్షేమ శాఖాధికారి నాగరాణి, ఐసిడిఎస్ పీడీ పద్మావతి, డిఇఒ అబ్రహం, జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయాధికారి డాక్టర్ పాల్ సతీష్, డిఐఒ డాక్టర్ నాగేశ్వరరావు, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, నగరపాలక సంస్థ వైద్యాధికారి డాక్టర్ మాలతీ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలకు స్థలాన్ని సేకరించాలి

చాట్రాయి తహశీల్దార్‌కు మంత్రి పార్థసారధి ఆదేశం



వైద్య శిబిరాన్ని పరిశీలించి మాట్లాడుతున్న మంత్రి పార్థసారధి

ప్రజాశక్తి - చాట్రాయి


ప్రభుత్వ వైద్యశాల నిర్మాణానికి స్థలాన్ని సేకరించాలని చాట్రాయి తహశీల్దార్‌ను మంత్రి కొలుసు పార్థసారధి ఆదేశించారు. మండలంలోని చీపురుగూడెం గ్రామంలో జ్వరాలు, కాళ్ల నొప్పులు, వాపులు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి గురువారం చీపురుగూడెం గ్రామంలో వైద్య శిబిరాన్ని పరిశీలించారు. వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న వారిని పరామర్శించారు. అనంతరం వైద్యులతో మాట్లాడుతూ జ్వరాలకు, కాళ్లవాపు, నొప్పులకు కీళ్ల నొప్పులకు కారణాలు అడిగి తెలుసుకున్నారు. వాటర్ ట్యాంకు నుంచి వస్తున్న తాగునీటిలో కలుషిత నీరు చేరుతుందని, పరిసరాల పరిశుభ్రత లేకపోవడంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని తెలుసుకున్నారు. పంచాయతీ అధికారులతో మాట్లాడుతూ వాటర్ ట్యాంకు గ్రౌండ్ లెవెల్ వాలు లీకై నీరు కలుషితమవుతున్నా కూడా ఎందుకు పట్టించుకోలేదని పంచాయతీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటర్ పైపులైను కూడా సరఫరా సరిగా లేదని, వెంటనే మరమ్మతులు చేయించాలని సూచించారు. ప్రజలు వైద్య సేవలకు ప్రభుత్వ ఆసుపత్రికి రావాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నామని, అందుబాటులో ప్రభుత్వ వైద్యశాల ఉండాలని అడిగారు. మండలంలో రెండో ప్రభుత్వ వైద్యశాల మంజూరైందని, నిర్మాణానికి మారుమూల ప్రాంతంలో స్థల సేకరణ జరిగిందని తెలుసుకున్న ఆయన ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ వైద్యశాల ఉండాలన్నారు. చుట్టుపక్కల ఎనిమిది గ్రామాలకు అందుబాటులో ప్రభుత్వ వైద్యశాల నిర్మాణానికి స్థలాన్ని సేకరించాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. చిన్నంపేటలో కూడా ఇలాంటి అనారోగ్య సమస్యలు ప్రజలు ఎదుర్కొంటున్నారని తెలుసుకున్నానన్నారు. ప్రభుత్వ అధికారులందరూ ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరగా పరిష్కారం చూపాలన్నారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ అన్ని విధాలుగా అండగా ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవరెడ్డి, ఏలూరు జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, కృష్ణా మిల్క్ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, పార్టీ మండల అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి, లక్ష్మణరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఐటియు సేవా కార్యక్రమాలు అభినందనీయం

జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎ.రాణి


ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సిఐటియు నిరంతరం కార్మిక సమస్యలపై పనిచేస్తూ రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ (జెసిఎల్) ఎ.రాణి కొనియాడారు. సిఐటియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యవస్థాపకులు అల్లూరు సత్యనారాయణ పదో వర్ధంతి, అల్లూరి సీతారామరాజు వందో వర్ధంతి కార్యక్రమం గురువారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత వారి చిత్రపటాలకు విఆర్‌ఎంజి కృష్ణారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ జెసిఎల్ ఎ.రాణి మాట్లాడుతూ కార్మిక హక్కుల కోసం, సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూనే సిఐటియు రక్తదానం వంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. రక్తదానం చేయటం ప్రాణదానం వంటిదని, ఆరోగ్యానికి కూడా మంచిదని సిఐటియు కృషిని అభినందించారు. సిఐటియు రాష్ట్రవ్యాప్తంగా కార్మికుల సమస్యలపై పనిచేస్తూ ఆదర్శనీయంగా ఉంటుందన్నారు. రానున్న కాలంలో ఇలాంటి మరిన్ని సేవా కార్యక్రమాలతో ముందుకు రావాలని ఆకాంక్షించారు. సభకు సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు అధ్యక్షత వహించి మాట్లాడుతూ అల్లూరు సత్యనారాయణ భూస్వామ్య కుటుంబంలో పుట్టి కార్మిక వర్గ శ్రేయస్సు కోసం తన జీవితాంతం పనిచేశారని, ఆయన ఆస్తిని సైతం కార్మిక వర్గానికి ధారాదత్తం చేశారని గుర్తు చేశారు. ఆయన ఆశయాల బాటలో సిఐటియు నడుస్తుందన్నారు. రక్తదాన శిబిరంలో 20 మంది వరకు కార్మికులు, ఉద్యోగులు రక్తదానం చేశారు. ఏలూరు అసిస్టెంట్ లేబర్ కమిషనర్ నాగేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు. సిఐటియు జిల్లా నాయకులు బి.సోమయ్య, ఎం.నాగమణి, కొర్రి విజయలక్ష్మి, వి.సాయిబాబు, సుభాషిని, బి.జగన్నాథం, మొహిద్దిన్, వెంకటరమణ, రాజేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ జెసిఎల్ ఎ.రాణి

ఏలూరులో హీరో సుమన్ సందడి




సుమన్‌కు బొకే అందిస్తున్న ఎస్ఎంఆర్ పెదబాబు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరులో శుక్రవారం సినిమా షూటింగ్‌లో పాల్గొనేందుకు హీరో సుమన్ వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరులో తనకు ఆత్మీయ మిత్రులు ఎంతో మంది ఉన్నారని, వారందరినీ కలవడం కోసమే ఒకరోజు ముందుగా ఏలూరు వచ్చానని తెలిపారు. రాష్ట్రంలోనే ఉమ్మడి కూటమి అధికారంలోకి రావటం శుభసూచికమన్నారు. టిడిపి ప్రభుత్వం కేంద్రం సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపాలని సూచించారు. అవగాహన లేక కొంతమంది యువత తప్పుదారి పడుతున్నారని, ఒక మంచి సందేశంతో కూడిన సినిమాను జడ్జి క్యారెక్టర్‌తో ప్రజల ముందుకు వస్తున్నానని హీరో సుమన్ తెలిపారు.

డిఎస్‌పి కార్యాలయ నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం



డిఎస్‌పికి విరాళం అందిస్తున్న మంత్రి పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు డిఎస్‌పి కార్యాలయం నిర్మాణ పనులకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, సమాచార శాఖ మంత్రి, నూజివీడు ఎంఎల్‌ఎ కొలుసు పార్థసారధి సూచన మేరకు హనుమాన్ జంక్షన్ మాజీ సర్పంచి కాకాని బాబు రూ.ఐదు లక్షల విరాళం అందించారు. ఈ విరాళాన్ని మంత్రి పార్థసారధి చేతుల మీదుగా నూజివీడు డిఎస్‌పి లక్ష్మయ్యకు అందించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ డిఎస్‌పి కార్యాలయం త్వరితగతిన పూర్తవ్వడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బంద్ ప్రశాంతం

ప్రజాశక్తి - ఏలూరు

పట్టణంలోని సెయింట్ థెరిస్సా పాఠశాలలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బంద్ పిలుపునిస్తూ విద్యార్థులతో తరగతులను బహిష్కరింపజేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అనిల్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి మోహన్, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అఖిల్, నాయకులు మనోజ్, పిడిఎస్‌యు నాయకులు మధు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణంలో విద్యాసంస్థలు బంద్ పాటించాయి. ఎస్ఎఫ్ఐ నాయకులు కొండబాబు, సాయి, అరుణ్, నాని, మనోహర్, జేమ్స్ పాల్గొన్నారు.

అధికారులు మండలాభివృద్ధిపై దృష్టి పెట్టాలి

పోలవరం ఎంఎల్ఎ బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలో ఉన్న అధికారులు, ప్రజా ప్రతినిధులు మండలాభివృద్ధిపై దృష్టి పెట్టాలని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అధికారులను ఆదేశించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి పలు శాఖల అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచిన అనంతరం మొట్ట మొదటి సారి సొంత మండలంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. మండలంలోని అధికారులు, ప్రజా ప్రతినిధులందరూ కలిసి కట్టుగా మండల సమస్యలపై దృష్టి పెట్టి మండలాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. మండలంలో ఏ సమస్య ఉన్నా నేరుగా తన వద్దకు తీసుకురావచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కోర్సా పోసమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు మల్లం వసంతరావు, ఎంపిడిఒ కె.ఏ.ఎం.మంగతాయారు, తహశీల్దార్ ఆర్‌వి.వెంకటేశ్వరరావు, ఎంఇఒ శ్రీనివాస్, ఎంపిటిసిలు సుస్సం సురేష్, నాలి శ్రీను, సర్పంచులు, పలు శాఖల అధికారులు, పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మంచినీటి చెరువు శుభ్రం

ప్రజాశక్తి - నిడమర్రు

నిడమర్రు గ్రామ మంచి నీటి చెరువులో చెత్త పేరుకుపోయి నీరు కలుషితం కావటంతో ఎంఎల్ఎ ధర్మరాజు ఆదేశాల మెరకు ఆ చెరువును గురువారం శుభ్రం చేశారు. ఈ పనులను ఎంఎల్ఎ ధర్మరాజు పరిశీలించారు.

ప్రజలకు మెరుగైన వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

ఆర్‌టిసి ఆదాయం పెంచడంతో పాటు ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు ఆర్‌టిసి అధికారులు చర్యలు తీసుకోవాలని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ సూచించారు. ఆయన క్యాంపు కార్యాలయంలో జంగారెడ్డిగూడెం డిపో మేనేజర్ గంగాధర్‌తో ఆయన గురువారం సమీక్షించారు. జంగారెడ్డిగూడెం నుంచి చింతలపూడి మీదుగా విజయవాడకు బస్సు సర్వీస్ ఏర్పాటు చేయాలని ఎంఎల్ఎ ఆదేశించారు.

విద్యార్థుల కోసం బస్సు ఏర్పాటు

తల్లిదండ్రుల హర్షం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని జి.కొత్తపల్లి హైస్కూల్‌కు రాఘవపురం, లక్ష్మీపురం, నిమ్మలగూడెం, గొల్లగూడెం నుంచి వచ్చే విద్యార్థులు ఇబ్బంది పడకుండా ఆర్‌టిసి జంగారెడ్డిగూడెం డిపో మేనేజర్ బస్సు రెండు పూటలా తిరిగేవిధంగా ఏర్పాటు చేశారు. సరైన ప్రయాణ సాకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తల్లిదండ్రులు టిడిపి కూటమి జి.కొత్తపల్లి నేతలను సంప్రదించగా వారు ఈ విషయాన్ని జంగారెడ్డిగూడెం డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే స్పందించి బస్సులు ఏర్పాటు చేశారు. టిడిపి అధ్యక్షులు రేగంటి రాంబాబు, సర్పంచి కస్సే శ్రీహరి, జనసేన నాయకులు మధు, లోకేష్ బిజెపి నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు జెండా ఊపి బస్సును ప్రారంభించారు.

దాతల సాయం అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి - మండవల్లి

దాతలు అందిస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకుని విద్యలో రాణించాలని భైరవపట్నం గ్రామ ప్రముఖులు చాపరాల దుర్గాప్రసాద్ కోరారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నల్లిపోయిన రాజేష్, యార్లగడ్డ శంకర్, మారగాని చిన్నబాబు, నల్లా వెంకటేశ్వరరావు, ఇంజనేని ఆజాద్ అశోక్ చక్రవర్తిల ఆర్థిక సహాయంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందించిన నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే విద్య ఒక్కటే మార్గమన్నారు. గౌరవ మర్యాదలు కూడా విద్య ద్వారా వస్తాయన్నారు. దాతలు అందిస్తున్న సహాయాన్ని స్ఫూర్తిగా తీసుకొని క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకుని గ్రామానికి దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన కోరారు. అనంతరం వంద మంది విద్యార్థులకు వెయ్యి నోటు పుస్తకాలను, పెన్నులను ఇతర సామగ్రిని అందించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ చిట్టిబాబు, బాలాజీ నల్లమోతు పాండురంగారావు, చాబత్తిన విజయ్, గుడివాడ మురళి, గణిశెట్టి మెహర్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి ఆరేళ్ల సమీకృత బిటెక్ ఇంపజినీరింగ్ కోర్సులో ప్రవేశాలకు సంబంధించి ప్రత్యేక కేటగిరి అభ్యర్థుల దరఖాస్తుల పరిశీలనలో భాగంగా గురువారం ఎన్‌సిసి విభాగంలో 590 మంది, క్రీడా విభాగంలో 350 మంది విద్యార్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిమిత్తం హాజరయ్యారు. గురువారం ఐదో తేదీన ఎన్‌సిసి, క్రీడా కేటగిరీలో సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ జరగనున్నట్లు ఆర్‌జియుకెటి అడ్మిషన్స్ కన్వీనర్, ఆచార్య ఎస్.అమరేంద్రకుమార్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు ఒకటో పట్టణంలో ఉన్న వెంకన్న ట్యాంక్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లలో చెట్ల కొమ్మలు తొలగింపు నిమిత్తం శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు జెపిబి.నటరాజన్ గురువారం ఒక ప్రకటనలో తెలపారు. ఈ సమయంలో వెంకన్న ట్యాంక్ సబ్ స్టేషన్ పరిధిలోని కొత్తగూడెం సెంటర్, ఏడు కాలువల సెంటర్, చాటపర్రు రోడ్, తూర్పు వీధి సాయి బాబా ఆలయం సెంటర్, తూర్పు వీధి గంగానమ్మ ఆలయం ఏరియా, ఫిల్ హౌస్ పేట, వివర్స్ కాలనీ, అరుంధతి పేట, పడమర వీధి, దొంగల మండపం ఏరియా, కందకం రోడ్డు, శనగపప్పు బజార్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేరాలు - ఘోరాలు

బస్సును ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఆగి ఉన్న బస్సును వెనుక నుంచి వేగంగా ఢీకొట్టి యువకుడు మృతి చెందిన ఘటన ఏలూరు జాతీయ రహదారిలో చోటు చేసుకుంది. పెదపాడు ఎస్ఐ శుభశేకర్ తెలిపిన వివరాల ప్రకారం... పెదపాడు మండలం పాత ముప్పారు గ్రామానికి చెందిన నాగ ఉమామహేశ్వరరావు (25) స్థానికంగా తల్లిదండ్రులతో కలిసి జీవిస్తున్నాడు. ఇతను పెదపాడు మండలంలోని హనుమాన్ జంక్షన్‌కు సమీపంలో ఏర్పాటు చేసిన చిత్రలహరి ధాబాలో దోస మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో అతను విధులు ముగించుకుని ఉదయం 6:30 ప్రాంతంలో తన ద్విచక్రవాహనంపై తిరిగి పాత ముప్పర్రు బయలుదేరాడు. ఈ క్రమంలో ఆర్‌టిసి బస్సు విజయవాడ వైపు నుంచి ఏలూరు నగరానికి వస్తూ అక్కడ జాతీయ రహదారిలో ప్రయాణికులను దింపేందుకు ఆగింది. ఉమమహేశ్వరరావు వేగంగా వచ్చి ఆగి ఉన్న బస్సును ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పెదపాడు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్త ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. పెదపాడు ఎస్ఐ శుభ శేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అల్లూరి జీవితం.. యువతకు ఆదర్శం

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు



ఏలూరు అర్బన్ : సిపిఎం జిల్లా కార్యాలయంలో...

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్వాతంత్ర్య సమరయోధులు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి, సిపిఎం జిల్లా ఉద్యమ నిర్మాత అల్లూరు సత్యనారాయణ పదో వర్ధంతి సందర్భంగా సిపిఎం వారికి ఘన నివాళి అర్పించింది. స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు, అల్లూరు సత్యనారాయణ చిత్రపటాలకు పూలమాలలు వేసి సిపిఎం కార్యకర్తలు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర పోరాటంలో అణగారిన గిరిజన ప్రజల హక్కుల కోసం పోరాడిన నేత అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. మన్యం వీరుడుగా దేశ స్వాతంత్ర పోరాటంలో పేరుందిన సమరయోధుడన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరు అల్లూరు సత్యనారాయణ అని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా, హమాలీ కార్మికులు, రైస్ మిల్ కార్మికుల హక్కుల కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎ.శ్యామలారాణి, పి.హైమా, జి.శారద, పి.దుర్గ, ఎం.సింహాచలం, వి.సాయిబాబు, వైఎస్.కనకారావు, కె.లెనిన్, పి.దుర్గాప్రసాద్, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు. ఏలూరు కలెక్టరేట్ కార్యాలయ సమీపంలో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎపిఎన్‌జిఒ సంఘం అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ నేతృత్వంలో ఉద్యోగులు పూలమాలవేసి నివాళులర్పించారు.

ఏలూరు స్పోర్ట్స్ : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఎంతోమందికి ఆదర్శప్రాయుడని ఎస్‌పి మేరీప్రశాంతి అన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిటిసి డిఎస్‌పి ప్రభాకర్, ఎఆర్ అదనపు ఎస్‌పి శేఖర్ పాల్గొన్నారు.

ఏలూరు సిటీ : జూట్ మిల్లు వద్ద అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ఎంఎల్ఎ బడేటి చంటి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామరాజు బోసిరాజు, సత్యనారాయణరాజు, సుందర రామరాజు, టిడిపి నాయకులు చౌడే వెంకటరత్నం పాల్గొన్నారు. ఏలూరులోని శ్రీ కృష్ణ జూట్ మిల్లు వద్ద సీతారామరాజు విగ్రహానికి జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ శిరిపల్లి ప్రసాద్, జిల్లా కార్యదర్శి కస్తూరి సాయి తేజస్విని, నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశీ నరేష్ పాల్గొన్నారు.

చాట్రాయి : అల్లూరి సీతారామరాజు జయంతి, జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య, స్వామి వివేకానంద వర్ధంతి కార్యక్రమాలను చాట్రాయి మండలంలోని తుమ్మగూడెం గ్రామం ఉర్దూ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గంపా వెంకట్రావు గురువారం ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని చిన్నంపేట గ్రామంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను సిద్ధార్థ హైస్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. హై స్కూల్ ప్రిన్సిపల్ పలగాని శ్రీనివాసరావు, సిపిఎం సభ్యులు కొమ్ము ఆనందం, యువజన సంఘం మండల నాయకుడు లింగోజు వంశీ పాల్గొన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

కైకలూరు : అల్లూరి సీతారామరాజును స్మరించడం ఎంతో ఆనందమని ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో అల్లూరి జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. భుజబలపట్నం, దొడ్డపట్ల, కైకలూరులో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొయ్యలగూడెం : అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కె.సాయి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు యు.వినోద్ మాట్లాడారు.,నీట్ స్కాంపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా బాధ్యతతో సమగ్ర దర్యాప్తు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యకిరణ్, వెంకట్‌రాజు పాల్గొన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమం సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సిపిఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక మండలాధ్యక్షుడు తాడిగ డప ఆంజనేయరాజు, బిసి చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి వెలగల దుర్గారావు, ఇళ్ల నరసయ్య, గిరి నాని పాల్గొన్నారు.



ఏలూరు స్పోర్ట్స్ : నివాళులర్పిస్తున్న ఎస్‌పి మేరీప్రశాంతి

చింతలపూడి : అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం వద్ద ఎం.వరలక్ష్మిదేవి అధ్యక్షతన నిర్వహించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి ఎస్.సూర్యకుమార్, మండల కమిటీ సభ్యులు పి.రంగయ్య, మహిళా సంఘం నాయకులు కె.అనురాధ, పి.గోపీలక్ష్మి, ఎస్.జోషి, డి.సత్యనారాయణ పాల్గొన్నారు. చింతలపూడి ప్రభుత్వ హాస్పిటల్ వద్ద అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం టౌన్ : జంగారెడ్డిగూడెంలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి సెల్ మండలాధ్యక్షులు గొల్లమందల శ్రీనివాస్, టిఎన్‌టియుసి పట్టణ అధ్యక్షుడు కొంచాడ ప్రసాద్, మాజీ ఎంపిపి వెంకట్రావు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : ఐటిడిఎలో నిర్వహించిన వేడుకల్లో పిఒ ఎం.సూర్యతేజ సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ పివిఎస్.నాయుడు, ప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు. చీమలవారిగూడెం గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోలోజు నాగేశ్వరరావు అధ్యక్షతన జయంతి వేడుకలు నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు చంద్ర బుల్లమ్మ, వెంకట స్వామి, మడకం వీరాయమ్మ, శంకరుడు, దుర్గమ్మ పాల్గొన్నారు.

నిడమర్రు : భువనపల్లిలో సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గవర సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వెలగలేటి మోహన, లింగబరి లక్ష్మణరావు, కానూరు రాజు, కోడూరి పెద్దకాపు, ధారబోయిన గాంధీ, తన్నీడు పుల్లారావు, భారతి పాల్గొన్నారు.

పోలవరం : ప్రగడపల్లి గ్రామపంచాయతీలో సర్పంచి కలుం బాపిరాజు ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

టి.నరసాపురం : మండలంలోని ఎస్ఆర్ నగర్ (మెట్ట) వద్ద సిపిఎం ఆధ్వర్యంలో అల్లూరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కమిటీ సభ్యులు అనుమాలు మురళి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మడకం కుమారి, వగ్గాల లక్ష్మి, బాణాల రామారావు, బరగడ కుమారి పాల్గొన్నారు.

కామవరపుకోట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎం.మల్లేశ్వరరావు అల్లూరి సీతారామరాజు చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి ఎం.భీమరాజు అధ్యక్షతన స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి సిపిఐ మండల కార్యదర్శి టివిఎస్.రాజు పూలమాలవేసి నివాళులర్పించారు.

ద్వారకాతిరుమల : పంగిడిగూడెం హైస్కూల్‌లో అల్లూరి చిత్రపటానికి పాఠశాల ఇన్‌ఛార్జి మస్తాన్ బీబీ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మద్దాల పెద్దిరాజు, కుమార్‌స్వామి, మల్లయ్య, ప్రభాకరరావు, రమేష్, వెంకటేశ్వరరావు, శారద, సీతామహాలక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

ముదినేపల్లి : రాజానగరంలో సీతారామరాజు విగ్రహానికి ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కామినేని శ్రీనివాస్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాలు, పెన్సిల్ బాక్స్‌లు పంపిణీ చేశారు.

మండవల్లి : భైరవపట్నంలో అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాజేంద్రప్రసాద్ శరీరదానం

ఏలూరు అర్బన్ : అల్లూరి సీతారామరాజు 127వ జయంతి, శత వర్ధంతి సందర్భంగా జనవిజ్ఞాన వేదిక నాయకులు కాకర్ల రాజేంద్రప్రసాద్ మరణానంతర శరీర దానం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో గురువారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాజేంద్రప్రసాద్ తన భార్య కుటుంబ సభ్యులతో సంబంధిత అంగీకర పత్రములను ప్రభుత్వ వైద్య కళాశాల డాక్టర్ జి.శైలజ హెచ్‌ఒడి ఎనాటమీ, డాక్టర్ చింతా దుర్గాకుమారిలకు అందించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు ఎస్ఎన్.రమేష్, బండారు కిరణ్ కుమార్, పంచాయతీ రాజ్ డిఇఇ లీలా మోహన్‌రావు, జి.ప్రసాదరావు, కృష్ణారావు, సీనియర్ జర్నలిస్టు, ఏలూరు జిల్లా చరిత్ర పరిశోధకులు బికెఆర్ఎస్.అయ్యంగార్, సిహెచ్.సుందరయ్య, పుష్పరాజ్ పాల్గొన్నారు.

కార్మిక ఉద్యమ నిర్మాణ అల్లూరు సత్యనారాయణ

ప్రజాశక్తి - నిడమర్రు

కార్మిక ఉద్యమ నిర్మాత అల్లూరు సత్యనారాయణ పదో వర్ధంతి సభ నిడమర్రు ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించారు. అల్లూరి సత్యనారాయణ చిత్రపటానికి కార్మిక సంఘాల నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. సిఐటియు ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు మాట్లాడుతూ అల్లూరి సత్యనారాయణ సిఐటియు సంఘాన్ని ఏర్పాటు చేయడం, కార్మికుల పట్ల అంకితభావంతో పనిచేయడమే కాకుండా కార్మికులందరినీ ఐక్యం చేసి ఏకతాటిపై పోరాడే వారన్నారు. ఈ కార్యక్రమంలో గవర సత్యనారాయణ బారణాల



నిడమర్రులో...

శ్రీను, కంచు వరప్రసాద్, మోహన, కన్నాజి మార్కండేయులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : స్థానిక సిఐటియు కార్యాలయంలో అల్లూరు సత్యనారాయణ పదో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలదండ వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శుక్ల బోయిన రాంబాబు మాట్లాడారు. అనంతరం అల్లూరి సీతారామరాజు 127వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలదండల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, సిఐటియు, డివైఎఫ్ఐ నాయకులు, రైస్ మిల్ బజార్ జెట్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వంగవీటి రంగా జయంతి వేడుకలు

ప్రజాశక్తి - చింతలపూడి

వంగవీటి మోహన్ రంగా 77వ జయంతి సందర్భంగా పాత బస్టాండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయలు కాపు సంఘ నాయకులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : నూజివీడు గాంధీ బొమ్మ సెంటర్‌లో రంగా విగ్రహానికి యువత పూలమాలలు వేసి కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మిత్రమండలి వ్యవస్థాపక అధ్యక్షులు రావి నాగేశ్వరరావు, శరత్‌కుమార్, ఎర్రంశెట్టి మురళీకృష్ణ, పగడాల సత్యనారాయణ, శీలం రామయ్యారావు, కొండా వెంకట్రావు పాల్గొన్నారు.

భీమడోలు : భీమడోలులో నిర్వహించిన వంగవీటి మోహనరంగా జయంతి కార్యక్రమాల్లో ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు పాల్గొన్నారు. సంతపేటలోని రంగా విగ్రహానికి పూలమాల వేసి సత్కరించారు. అనంతరం వంగవీటి కాపు యువత ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్నారు. సిహెచ్‌సిలో రోగులకు పండ్లు,రొట్టెలు పంపిణీ చేశారు.

ఏలూరు సిటీ : ఏలూరు ఓవర్ బ్రిడ్జ్ వద్ద అభయ స్ఫూర్తి భవన నిర్మాణ కార్మిక సేవా సంఘం ఆధ్వర్యంలో రంగా జయంతి వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఎల్ఎ బడేటి చంటి హాజరై రంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అభయ స్ఫూర్తి భవన నిర్మాణ కార్మిక సేవా సంఘం అధ్యక్షులు తోట నాగు, గౌరవ అధ్యక్షులు పూజారి కొండ, ఉపాధ్యక్షులు దుగ్గిరాల రాజు, సెక్రటరీ ఆదిరెడ్డి ముత్యాలరావు, టిడిపి నాయకులు ఆర్నేపల్లి తిరుపతి పాల్గొన్నారు.

ఏలూరు టౌన్ : విజయవాడ నడిబొడ్డులో వంగవీటి మోహన్ రంగా గారి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వంగవీటి మోహనరంగా 77వ జయంతి సందర్భంగా స్థానిక మెయిన్ బజార్ ఎనిమిదో డివిజన్ కన్నయ్య పార్క్ వద్ద ఉన్న రంగా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పలువురు పేదలకు వస్త్రాలను పంపిణీ చేశారు. కృష్ణా జిల్లాకు పేదల నేత వంగవీటి మోహన రంగా పేరు పెట్టాలని కాపు సంక్షేమ సేవాసంఘ రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీరాములు డిమాండ్ చేశారు. రంగా జయంతి సందర్భంగా ఆయన మాట్లాడారు. వంగవీటి మోహన రంగా 77వ జయంతి కార్యక్రమం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో ఏలూరులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కైకలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొడ్డు నోబుల్, తాళ్లూరి చక్రవర్తి, దండుబోయిన చంద్రశేఖర్, గౌడు రంగబాబు, లంకా రామ్మోహన్, తీడ సత్యనారాయణ, దాసరి రామ్‌ప్రసాద్, కొమ్మన సాంబశివరావు, రాటాలు, కెఎస్ఎన్.మూర్తి, సేవాదళ్ సుబ్బారావు పాల్గొన్నారు.

కైకలూరు : కైకలూరులో టిడిపి కూటమి, వైసిపి నాయకులు వేరువేరుగా రంగా జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. కైకలూరులోని గాంధీబొమ్మ సెంటర్‌లో రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన విగ్రహాల వద్ద నాయకులు, కార్యకర్తలు వేడుకలు చేసి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్, కెవిఎన్ఎం నాయుడు, మాజీ ఎంఎల్‌సి కమ్మిలి విఠల్, మాజీ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు, పంజా రామారావు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : పట్టణంలో గవర్నమెంట్ హాస్పిటల్ వద్ద రంగా విగ్రహానికి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా కరటం రాంబాబు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో దుగ్గిన శ్రీను, మలిశెట్టి దుర్గబాబు, సంకు మధుబాబు పాల్గొన్నారు.

కుక్కునూరు : కుక్కునూరులో కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. రంగా గారి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి కేకు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీలకతీతంగా, కులమతాలకు అతీతంగా రంగా అభిమానులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ముదినేపల్లి : ముదినేపల్లి , గురజ గ్రామాల్లో రంగా విగ్రహాలకు కూటమి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కొడాలి వినోద్, కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, జనసేన మండలాధ్యక్షులు వీరంకి వెంకటేశ్వరరావు, శ్రీహరిపురం సర్పంచి పరసా విశ్వేశ్వరరావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పోలవరం : గూటాలలో జనసేన నాయకులు మొగళ్ల హరిబాబు, ఆటపాకుల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రంగా జయంతి వేడుకలు నిర్వహించారు. పోలవరంలో ఉన్న గోదావరి నిలయం వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం, పోలవరం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు అందించారు.

భీమడోలు సిహెచ్‌సి సేవలు అభినందనీయం

ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు

భీమడోలు : ఉంగుటూరు నియోజకవర్గంతో పాటు పలు పరిసర మండలాలకు చెందిన ప్రజలకు సాధారణ వైద్యంతో పాటు, ప్రత్యేక విభాగపు సేవలు అందిస్తున్న సామాజిక ఆరోగ్య కేంద్రం సేవలు అభినందనీయమని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలను పరిశీలించి, అక్కడ రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సామాజిక ఆరోగ్య కేంద్రం పర్యవేక్షకులు డాక్టర్ ఎన్.సునీత సామాజిక ఆరోగ్య కేంద్రం ద్వారా అందుతున్న సేవలు, రానున్న కాలంలో మరిన్ని సేవలు అందించేందుకు వైద్య ఆరోగ్యశాఖ సిఫార్సు చేసిన అంశాలు, ఇతర విషయాలను ఎంఎల్ఎ దృష్టికి తీసుకొచ్చారు. ఇదే క్రమంలో ఇప్పటికే అందుబాటులో ఉన్న సేవలు మరింత సమర్థవంతంగా అందించేందుకు కావాల్సిన అవసరాలను ఆయన దృష్టికి తెచ్చారు. ఈ మేరకు వినతిపత్రాన్ని సామాజిక ఆరోగ్య కేంద్రానికి చెందిన ఇతర వైద్యులతో కలిసి ఆయనకు అందించారు. తొలిసారిగా సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఎంఎల్ఎను సత్కరించారు.

స్వచ్ఛమైన తాగునీరందించేందుకు చర్యలు

డిపిఒ శ్రీనివాస్ విశ్వనాథ్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

జిల్లా వ్యాప్తంగా ఆగష్టు 31 వరకు విస్తృతంగా గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు అమలు చేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు అన్ని చర్యలు చేపట్టామని డిపిఒ తూత్తిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. ఇప్పటికే పంచాయతీ రాజ్ కమిషనర్ కన్నబాబు, కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాలతో జిల్లాలో గ్రామ పంచాయతీ సిబ్బంది అప్రమత్తమై 547 గ్రామ పంచాయతీల్లో అతిసార వ్యాధి నివారణపై క్షేత్రస్థాయిలో ప్రారంభించినట్లు చెప్పారు. 62 రోజుల ప్రత్యేక ప్రణాళికలో భాగంగా జిల్లాలో 1500 తాగునీటి ట్యాంకులు, 1300 పిడబ్ల్యూఎస్ స్కీమ్స్, 44 సిపిడబ్ల్యూఎస్ స్కీమ్స్, రెండు వేల తాగునీరు బోరులు, వెయ్యి డైరెక్ట్ పంపింగ్ స్కీమ్స్, మూడు లక్షల ప్రయివేట్ కుళాయిలు, 1100 పబ్లిక్ కుళాయిలు, మూడు వేలు చేతి పంపులు దశలవారీగా శుభ్రపర్చి క్లోరిన్ చేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి అన్ని చర్యలు చేపట్టామని అన్నారు.

అంతర్వేదిగూడెంలో పర్యటన

మండలంలోని అంతర్వేదిగూడెంలో జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూత్తిక శ్రీనివాస విశ్వనాథ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఏజెన్సీ ప్రాంతంలో జరుగుతున్న స్టాప్ డయేరియా క్యాంపెయిన్ కార్యక్రమాలపై పంచాయతీ కార్యదర్శి ఎం.అంజలీదేవిని అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా నిర్వహించిన అతిసార వ్యాధి నివారణ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం తాగునీటి సరఫరా ట్యాంకును పరిశీలించి క్లోరినేషన్ చేయించారు.

ఎర్రకాలువ నుంచి సాగునీరు విడుదల

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

మండలంలోని కొంగవారిగూడెం ఎర్ర కాలువ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా సాగునీటిని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన కుమార్ గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టూరిజం స్పాట్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ముదినేపల్లి

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెదగొన్నూరు పంచాయతీ కార్యదర్శి జె.గిరిజ అన్నారు. పెదగొన్నూరు పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో డయేరియా, డెంగీ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాటి నివారణ చర్యలు వివరిస్తూ ఇంటింటికి తిరుగుతూ గ్రామస్తులకు వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు.

రాజాకు పలువురి అభినందన

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండలంలోని తోటపల్లి కొత్త మాలపల్లి పాఠశాల ఉపాధ్యాయులు జి.రాజా డివైఇఒ ప్రిలిమ్స్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి, మెయిన్స్ పరీక్షలకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా రాజాను డెమొక్రటిక్ పిఆర్‌టియు ఆగిరిపల్లి మండల అధ్యక్షురాలు బివిఎస్.లక్ష్మి, ప్రధాన కార్యదర్శి జి.నాగరాజు, జిల్లా మహిళా కార్యదర్శి జి.నాగలక్ష్మి, ఉపాధ్యాయులు కె.వంశీ వశిష్ట అభినందించారు.

నీటి సమస్యకు పరిష్కారం

ఎంఎల్ఎ బాలరాజుకు మేడేపల్లి గ్రామస్తుల ప్రశంసలు

ప్రజాశక్తి - కుక్కునూరు

చిర్రి బాలరాజు గతంలో ఎన్నో సార్లు వేలేరుపాడు మండలానికి వచ్చారు. కాని ఎంఎల్ఎ హోదాలో మొదటిసారి మండలానికి వస్తుండగా మేడేపల్లి గ్రామంలో ఉన్న మహిళలు కాలి బిందెలతో రోడ్డుపై అడ్డుకున్నారు. వెంటనే తన కాన్వాయ్ నుంచి దిగి వారి సమస్య అడిగి తెలుసుకున్నారు. గత మూడు నెలలుగా నీళ్ళు రావడం లేదని వారి ఆవేదనను ఎంఎల్ఎ ముందు వ్యక్తం చేశారు. వెంటనే ఎంఎల్ఎ స్థానిక పంచాయతీ సెక్రటరీకి ఫోన్ చేసి సమస్యను వివరించారు. దీనికి స్పందించి అధికారులు వెంటనే మరమ్మతులు చేసి ఆ గ్రామానికి సాయంత్రానికి నీరు అందించారు. గ్రామస్తులు ఎంఎల్ఎకు కృతజ్ఞతలు తెలిపారు.

నోటీసు

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సివిల్ జడ్జి కోర్టు (సీనియర్ డివిజన్)లో

ఇ.పి. నెం. 67/2023 ఇన్

ఒ.ఎస్. నెం. 109/2014

(SCJC, రామచంద్రపురం)

బిట్వీన్:

సత్తి చిన్నారెడ్డి -డి. హెచ్. ఆర్

మరియు

యజ్జల సావిత్రి -జె. డి. ఆర్.

జె.డి.ఆర్: యజ్జల సావిత్రి, W/o. వెంకటేశ్వర్లు, వయస్సు 42, హిందూ, స్త్రీ, గృహిణి, ఇంటి నెం. 14-17-25, సాంఘిక సంక్షేమ హాస్టల్ వీధి, 24వ వార్డు, యాగర్లపల్లి, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా, TPG PJCJC.

పై నెంబరు ఇ.పి. నందు జె.డి.ఆర్. అయిన మీ యొక్క షెడ్యూలు ఆస్తిని వేలం వేయుట ద్వారా డిక్రీ బాకీ రాబట్టుకొనుటకు డి.హెచ్.ఆర్. దాఖలు చేసిన పై ఇ.పి. ది. 22-07-2024వ తేదీన మీ హాజరు కొరకు వాయిదా అయివున్నది. సదరు **ది. 22-07-2024వ తేదీన ఉదయం 10.30 ని॥ల లగాయితు** శ్రీ పై కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా గాని, మీ అడ్వకేటు ద్వారా గాని హాజరయి సదరు పై ఇ.పి. నందు మీ ఆక్షేపణలు తెలియపరచుకోవలసినది. లేనిచో సదరు పై ఇ.పి. మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపరచడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

కొవ్వూరి అప్పిరెడ్డి, న్యాయవాది

తాడేపల్లిగూడెం తాడేపల్లిగూడెం-534102

తేది:02-7-2024 సెల్: 9440128616

IN THE COURT OF THE Ist ADDITIONAL CIVIL JUDGE (JUNIOR DIVISION)

O.S.17/2024

Between:

వాది : సత్తి సనత్ కుమార్ రెడ్డి

ప్రతివాది : నెక్కంటి లీలా కళ్యాణి

వాది తరపున చేయించిన ప్రకటన

ప్రతివాది :

నెక్కంటి లీలా కళ్యాణి, W/o.అప్పారావు, స్త్రీ, 43 సం॥లు, డోరునెం.2-66/1, పండిత విల్లూరు, పోడూరు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నెంబరు దావా గ్రంథములో రెస్పాండెంట్/ ప్రతివాది అయిన మీకు శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం పైనెంబరు దావా గ్రంథము O.S.17/2024లో మరియు I.A.37/2024 నందు మీకు ఎన్నిసార్లు సమన్లు మరియు నోటీసులు పంపించిననూ మీకు అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది.11-7-2024 తేదీన ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని ప్లీడరు గారి ద్వారా గాని పైకోర్టు వారి ఎదుట హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేయవలసినదిగాను, అట్లు కాని యెడల పైకోర్టు వారు మీపై పరోక్షమున తీర్మానించెదరని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

EVS Prasad
Advocate, Tanuku, W.G.Dt.
Cell: 9849518602